# పేదలు సరే.. పెద్దల సంగతేంటి..?



మియాపూర్ సర్వేనెంబరు 100లో అక్రమంగా వెలసి నిర్మాణం పూర్తికావచ్చిన భారీ భవనం



జంట సర్వే నెంబర్లలో తాజాగా పుట్టుకొస్తున్న అక్రమ భవనాలు

**సైబరాబాద్ ప్రతినిధి, జూన్ 23 ప్రభాతవార్త**

ఒకటి కాదు, రెండు కాదు పట్టపగలు ప్రభుత్వ భూమిలో పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఏకకాలంలో నిరాటంకంగా కొనసాగినా వారు మాత్రం కళ్లు తెరవలేదు... వేలకోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూమి రక్షణ బాధ్యతలు చేపట్టిన హెచ్ఎండిఎ అధికారులే అక్రమార్కులను ప్రోత్సహిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు... కబ్జాల విషయమై తామే స్వయంగా స్పందించాల్సి ందిపోయి ఎన్ని ఫిర్యాదులొచ్చినా బుట్టదాఖలు చేస్తూ అడిగినవారికి కుంటిసాకులు చెప్పారు... నాలుగు నెలల క్రితం ప్రభాతవార్త దినపత్రికలో 'వేలకోట్ల విలువైన ప్రభుత్వ భూమిలో హెచ్ఎండిఎ అధికారుల దొంగాట' అన్న శీర్షికన ప్రధాన కథనం ప్రచురించినా కాకమ్మ కబుర్లు చెబుతూ కాలం వెళ్లబుచ్చారు... గతనెల 24న 'కబ్జారాయుళ్ల కొమ్ముకాస్తున్న హెచ్ఎండిఎ' అన్న కథనంతో కాస్త తేరుకున్న అధికారులు ఒక ప్రహసనం నిర్మాణాల కూల్చివేతను చేపట్టి బడాబాబులను మాత్రం వదిలేశారు... తాజాగా హెచ్ఎండిఎ అధికారుల చేతగానితనాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు అక్రమార్కులు అమాయక పేదలను రంగంలోకి దింపి తాము వెనకాలవుంటూ అసలు కథ నడిపించారు... అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెక్కాడితేగాని డొక్కాడని అమాయక ప్రజలు పనులు మానుకొని అప్పులుచేసి మరీ వివిధ జిల్లాలనుంచి హైటెక్ సిటీకి చేరుకొని తమ అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంచేసి భంగపడ్డారు.

శేరిలింగంపల్లి మండలంలోని మియాపూర్ జంట సర్వేనెంబర్లు 100,101లలో 545ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇండ్లస్థలాలు ఇప్పిస్తామంటూ కొందరు అక్రమార్కులు చెప్పిన మాయమాటలు విని గతకొన్ని రోజులుగా అష్టకష్టాలు పడ్డ పేదల విషయం అటుంచితే అదే ప్రభుత్వ భూమిలో అడ్డగోలుగా భారీ భవంతులు నిర్మిస్తున్న బడాబాబుల సంగతేంటన్నది సర్వత్రా వెల్లువెత్తుతున్న ప్రశ్న. ప్రభుత్వ భూమిని ఆనుకొనివున్న ఇతర సర్వేనెంబర్ల పేరిట ఎవరో అనామకులను యజమానులుగా చిత్రీకరించి యధేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటూ ప్రభుత్వ భూమిలోనే ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తున్నా ఘనతవహించిన హెచ్ఎండిఎ అధికారులకు అవి కనబడడం లేదు. కనీసం ఆదిలోనైనా వారిని గట్టిగా వారించే ప్రయత్నం చేయలేకపోయిన హెచ్ఎండిఎ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది నిర్వాకం కారణంగా నేడు పదుల నుంచి వందలకు ఆతర్వాత వేల సంఖ్యలో పేదలు ప్రభుత్వ భూమిలో ఆశ్రయంపొందాలన్న ఆశతోవచ్చి అగచాట్లు పడ్డారు.

**అధికారుల అలసత్వం అసలుకే మోసం**

రిజిస్ట్రేషన్ వ్యవస్థలోవున్న లొసుగులను ఆసరాగా చేసుకొని ఈస్థలం చుట్టూ ఉన్న ప్రైవేటు సర్వే నెంబర్లలో ఏర్పాటైన కాలనీల లేఅవుట్‌లకు బైనెంబర్లు వేస్తూ కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకొని ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. ఇవే స్థలాలకు జిహెచ్ఎంసి అధికారులు సైతం అందినకాడికి దండుకుంటూ అనుమతులు మంజూరు చేస్తుండంతో యధేచ్ఛగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఈవిషయమై ప్రభాతవార్త గత రెండు దశాబ్దాలుగా కోకొల్లలుగా కథనాలు వెల్లడిస్తూనేవున్నా కంటితుడుపు చర్యగా అక్రమ నిర్మాణాలను కూలగొడుతున్న హెచ్ఎండిఎ, రెవెన్యూ అధికారులు వెంటనే హద్దులు నిర్ణయించి ఫెన్సింగ్ వేస్తామని చెబుతూ ఆతర్వాత అటువైపు చూడటంలేదు. ఇదే అదునుగా కబ్జాదారులు రెచ్చిపోతూ విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రస్తుతం అక్రమార్కుల మాయ మాటలతో మోసపోయి కోర్టు వివాదంలోవున్న ప్రభుత్వ భూమిలోకి తెలియక అడుగుపెట్టిన నిరుపేదలనైతే సమర్ధవంతంగా అవతలికి తరిమేశారు గాని వివిధ శాఖల అధికారుల అండతో ఏకంగా ప్రభుత్వ భూమిలోనే ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న ప్రశ్నపై హెచ్ఎండిఎ అధికారుల నుంచి ఇప్పటివరకు స్పష్టమైన సమాధానంలేదు.

# ప్రజలకు అండగా ఉండేవాడే నాయకుడు

**ఎంపి ఈటెల రాజేందర్**

**కంటోన్మెంట్, జూన్ 23 ప్రభాతవార్త:**

పిలిస్తే పలకరించడంతో పాటు ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఆదుకునే వ్యక్తి అసలైన రాజకీయ నాయకుడని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్ మహేంద్ర హిల్స్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త వి.నరిసింగ్ రావ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సమస్యలు తనతోనే పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి కంటోన్మెంట్ బోర్డుకు రావాల్సిన బకాయిలపై తనవంతు కృషి చేస్తామన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తన గెలుపునకు సహకరించిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ, బిజెపి నాయకులు డాక్టర్ వంశా తిలక్, పిట్ల నాగేశ్, నరిసింగ్‌రావ్, మోండా కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.

**మారేడ్‌పల్లి 2 బిహెచ్‌కె కాలనీ సందర్శించిన ఈటెల..**

వెస్ట్‌మారేడ్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సంవత్సరాల తరబడి నివాసముంటున్న అర్హులైన లబ్ధిదారులకు త్వరలో ఫ్లాట్లను అలాట్ చేసేందుకు తనవంతు కృషిచేస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు. మోండా డివిజన్‌లోని మారేడ్‌పల్లిలోని 2 బిహెచ్‌కె కాలనీలో కార్పొరేటర్ కొంతం దీపిక ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి బదిలీ

**ఉప్పల్, జూన్ 23 ప్రభాతవార్త :**

ఉప్పల్ భగాయత్‌లో పోకిరీలు ప్రేమ జంటను వేధించిన వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణల నేపథ్యంలో ఉప్పల్ సిఐ ఎన్.ఎలక్షన్‌రెడ్డిపై బదిలీ వేటు వేశారు. ఈ కేసులో ఇప్పటికే ఎస్ఐ శంకర్‌ను సస్పెండ్ చేయగా, తాజాగా సిఐ ఎలక్షన్‌రెడ్డిని సిపి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ భగాయత్ లేఅవుట్‌లో ఈనెల 16వ తేది రాత్రి నగరంలోని కొండాపూర్‌కు చెందిన ఒక జంట కారులో ఉండగా పీర్జాదిగూడకు చెందిన అమర్, మారుతీ, సాయిచరణ్, శేషావలీ, ఉదయ్ అనే వ్యక్తులు వీడియోలు తీసి వారిని బెదిరించిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఐదుగురిని ఇప్పటికే రిమాండ్ చేయగా, మధ్యవర్తులుగాఉన్న సంతోష్, శివ అనే వ్యక్తులు రూ.2లక్షల 70వేలు వసూలు చేసినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈ కేసులో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో ఎస్ఐ శంకర్‌ను సస్పెండ్ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం ఉప్పల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. ఎలక్షన్‌రెడ్డిని సిపి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఆదేశాలు జారీచేశారు. ఉప్పల్ ఇంచార్జ్ ఇన్‌స్పెక్టర్‌గా జి.మన్మదకుమార్‌ను నియమించారు. కాగా కొద్ది రోజులుగా ఉప్పల్ భగాయత్‌లో అర్ధరాత్రి వరకు నడిచే హోటల్స్, బార్‌లకు వచ్చే జంటలు, ఇతరులను బెదిరించి కొందరు డబ్బులు వసూలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అనధికారికంగా ఏర్పాటు చేస్తున్న ఈ హోటల్స్ కారణంగా అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో భగాయత్‌లో గతంలో ఓ రౌడీషీటర్ కత్తితో గాయపర్చుకున్న కేసుతోపాటు, ప్రజల నుంచి డబ్బులు సేకరించి బిచాణా ఎత్తివేసిన రియల్ ఎస్టేట్ సంస్థ కేసు విషయంలో కూడా పోలీసులపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు దీనిపై విచారణ చేస్తున్నారు.

## నేడు డాక్టర్ రాజగోపాల్‌కు 'డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ సంజీవరెడ్డి స్మారక పురస్కార' ప్రదానం

**చిక్కడపల్లి, జూన్ 23 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూగర్భగనుల శాఖ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వీడి.రాజగోపాల్‌కు 'డాక్టర్ పైడి లక్ష్మయ్య, డాక్టర్ పిఎల్.సంజీవరెడ్డి స్మారక పురస్కార' ప్రదానోత్సవ కార్యక్రమం 24న చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రసమయి, డాక్టర్ పైడి లక్ష్మయ్య ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగనుంది. తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ హాజరై ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యనిపుణులు పద్మశ్రీ డాక్టర్ ఎఎస్.నారాయణ, ఆదాయపు పన్ను శాఖ విశ్రాంత చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప తదితరులు పాల్గొననున్నారు. రచయితగా, సాహితీవేత్తగా విశేషంగా కృషి చేస్తున్నందుకుగాను ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

## రూ. 35 కోట్లతో

# అవయవ మార్పిడి ఆపరేషన్ థియేటర్‌లు

**రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు**

**సికింద్రాబాద్, జూన్ 23 ప్రభాతవార్త :**

ఎట్టకేలకు సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో అవయవాల మార్పిడి జరపడం కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు జరుగుతోంది. మరికొన్ని వారాలలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు పనులు పూర్తయి రోగులకు అందుబాటులోకి రానుంది. ఆధునిక సదుపాయాలు కల్పించి రోగులకు మరింత మెరుగైన వైద్యం అందజేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. వైద్యరంగంలో అందుబాటులోఉన్న అత్యాధునిక సౌకర్యాలు, సదుపాయాలతో కూడిన హైఎండ్ మాడ్యులర్ శస్త్రచికిత్సల కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది. రూ. 35 కోట్ల వ్యయంతో ప్రస్తుతమున్న ఆసుపత్రి ప్రధాన బిల్డింగ్‌లోని ఎనిమిదవ అంతస్తులో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అవయవాల మార్పిడి కోసం ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌లను సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేయాలని 2017లోనే ప్రతిపాదించారు. గాంధీ ఆసుపత్రిలో మూత్రపిండాల మార్పిడి విజయవంతంగా పూర్తవుతుండడంతో మరిన్ని సదుపాయాలు కల్పిస్తే రోగులకు ఉపయోగకరంగా ఉంటుందని అప్పట్లో ప్రతిపాదించారు. ఇందుకోసం అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని భావించారు. అప్పటికే అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రిని నోడల్ కేంద్రంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందుకని అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌ల ఏర్పాటుకు తీర్మానించారు.

**ఏర్పాటు వల్ల కలిగే ఉపయోగాలు....**

రూ. 35 కోట్ల వ్యయంతో ఆరు ఆపరేషన్ థియేటర్‌లను అందుబాటులోకి తేనున్నారు. ఈ ఆపరేషన్ థియేటర్‌ల వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఈ థియేటర్‌ల వల్ల గుండె, మూత్రపిండం, ఊపిరితిత్తులు, లివర్‌లను మార్పిడి చేయవచ్చు. ఈఎన్‌టీ విభాగంలో కాక్లియర్ ఇంప్లాంట్‌లు జరపవచ్చు. ఇప్పుడున్న ఆసుపత్రిలోని ఆపరేషన్ కేంద్రాలను విభాగాల వారీగా ఉపయోగిస్తున్నారు. అవయవాల మార్పిడి చేసేందుకు ఆయా అవయవాల వైద్య నిపుణులు పాల్గొంటారు. ఒకవేళ గుండె మార్పిడి జరిపిన అనంతరమే లివర్ మార్పిడి చేయాలంటే కొన్ని విధివిధానాలు అడ్డువస్తున్నాయి.

అందుకని దేనికదే వేరువేరు ఆపరేషన్ థియేటర్‌లు ఉంటే మెరుగైన సత్వర వైద్య సేవలు అందించే వెసులుబాటు ఉంటుంది. అన్ని అవయవాల వైద్య నిపుణులు అందుబాటులో ఉండి ఆపరేషన్‌లు జరపడం తేలికవుతుంది. ఆయా విభాగాలకు చెందిన అత్యాధునిక వైద్య పరికరాల ఏర్పాట్లు జరుపుతున్నారు. హైఎండ్ తరహాలో రూపొందుతున్న ఈ నూతన కేంద్రాలన్ని స్టీల్ కోట్‌తో ఉండడం వల్ల వాటిల్లోకి బ్యాక్టీరియా ప్రవేశించే అవకాశం ఎంతమాత్రం ఉండదు. అవయవ మార్పిడి ఆపరేషన్ థియేటర్‌లలో విధులు నిర్వహించే వైద్యులతో పాటు ఇతర సిబ్బంది కూడా అనుభవజ్ఞులై ఉంటారు. వీటి ఏర్పాటు పూర్తయితే నిమ్స్ తరహా వైద్య సేవలు అందజేసే అవకాశం ఉంటుంది.




గాంధీ ఆసుపత్రి

**కొన్ని వారాల్లో అందుబాటులోకి తెస్తాం**

**సూపరింటెండెంట్ రాజారావు**



ఇప్పటికే గాంధీ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నాం. రూ.35కోట్ల వ్యయంతో మాడ్యూల్ తరహా ఆపరేషన్ థియేటర్‌లు ఏర్పాటు జరుపుతున్నాం. మరికొన్ని వారాలలో వాటి ఏర్పాటు పూర్తవుతుంది. అత్యాధునిక మాడ్యూల్ ఆపరేషన్ థియేటర్‌లు అందుబాటులోకి వస్తే అవయవాల మార్చాల్సిన రోగులకు ఎంతో ఉపయోగపడుతుంది.

# హైదరాబాద్ వార్త







బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుంతలమైన బోడుప్పల్-హేమనగర్ రోడ్డు, పక్కన సికింద్రాబాద్‌లోని ఒక రోడ్డు దుస్థితి

# బాబోయ్.. ఇవేం రోడ్లు!

- అడుగుకో అగాధం.. రూ.వేల కోట్లు
- అయినా రోడ్లకు తూట్లు
- పూర్తిగా పాడైపోయిన గోల్నాక- ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి
- అంతర్గత రోడ్లు మరీ అధ్వాన్నం
- రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్న ద్విచక్రవాహనదారులు
- సీసీ రోడ్లు 6,167 కి.మీ,అందులో బీటీ రోడ్లు 2,846 కి.మీ.. నగరంలో మొత్తం రోడ్ల పొడవు 9,013 కి.మీ

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త**

రాజధానిలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. సగానికిపైగా వీధుల్లో గుంతలు దర్శనమిస్తున్నాయి. అరకిలో మీటరు కూడా సాఫీగా ప్రయాణించలేని దుస్థితి. నాలుగేళ్లుగా రహదారి పనులు నిలిచిపోవడమే ఇందుకు కారణం. ఫలితంగా వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతల్లో ప్రయాణిస్తూ అనారోగ్యాలకు గురవుతున్నారు. వర్షం కురిస్తే వరదతో రోడ్లు మరింత ప్రమాదకరంగా మారుతాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నగరంలో మొత్తం రోడ్ల పొడవు 9013కి.మీ కాగా సిసి రోడ్లు 6167కి.మీ. అందులో బీటీ రోడ్లు 2846కి.మీ. నగరంలో నాలుగు లైన్లు, అంతకన్నా ఎక్కువ వెడల్పు ఉండే 811 కి.మీ ప్రధానరహదారులను జీహెచ్ఎంసీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చింది. ఐదేళ్ల నిర్వహణకు రూ. 1,839 కోట్లు చెల్లించేలా ఒప్పందం చేసుకుంది. మొదటి మూడేళ్లలో పలు ప్రాంతాల్లో నూతన రోడ్లు నిర్మించాలి. తర్వాత రెండేళ్ల గుంతలు పడకుండా చూసుకోవాలి. కానీ ప్రైవేటురోడ్లపై ఎక్కడ చూసినా భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. నగరంలో కాలనీ రోడ్లను తాగునీరు, మురుగు నీటి పైపులైన్లు, విద్యుత్ కేబుళ్ల కోసం తరచుగా తవ్వుతున్నారు. మరమ్మతులు మాత్రం చేయడం లేదు. గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చాలన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ ఏటా రూ.25కోట్లు వెచ్చించి ఐఆర్‌టీ బృందాలను నియమిస్తుంది. ఇంజినీర్లు ఆయా బృందాల వద్ద కమీషన్లు తీసుకుని, పనులు చేయకున్నా.. బిల్లులు ఇస్తున్నారనే విమర్శలున్నాయి.

భారీ వర్షాలకు మహానగర రహదారులు ఎప్పటిలాగే ఛిద్రమయ్యాయి. వందలకోట్లు ఖర్చుపెట్టినా పరిస్థితిలో మార్పు కాలేదు. నగరంలో రోడ్లన్నీ గుంతలు, కంకరతో నిండి స్థానికులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధ్వానమైన రోడ్లపై ప్రయాణిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. దీనికి తోడు పైపులైన్లు, కేబుళ్ల కోసం తవ్విన రోడ్లను సకాలంలో పునరుద్ధరించకపోవడంతో చాలాచోట్ల దారులు అస్తవ్యస్తంగా మారాయి. ఎక్కడపడితే అక్కడ గుంతలు పడినా పట్టించుకునే వారు కరువయ్యారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిరుజల్లులు కురిస్తే నగరం చెరువును తలపిస్తుంది.. అలాంటిది భారీ వర్షం పడిందంటే ఇక సముద్రాన్ని తలపించేలా ఉంటోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చాలారోడ్లు గుంతల మయంగా మారడంతో పాటు వరద నీటితో కొట్టుకు వచ్చిన మట్టి మేట వేసింది. ఒక వైపు గుంతలు, మరో వైపు మట్టి, కంకర ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలివేటెడ్ కారిడార్ పనులు జరుగుతున్న ఉప్పల్-నారపల్లి, గోల్నాక-అంబర్‌పేట చేనెంబర్ మీదుగా వరంగల్ జాతీయ రహదారి పూర్తిగా రోడ్డు పాడైపోయింది. ఇక అంబర్‌పేట ఆలీకేఫ్-జలమండలి క్రికెట్ గ్రౌండ్-ఉప్పల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం, కెసిఆర్ నగర్- నాగోల్ మెట్రో రోడ్డు మార్గంలో, అలాగే ఉప్పల్ ఆర్టీసి బస్సుస్టాండ్ అధ్వాన్నంగా తయారైంది. నాణ్యతా రహిత పనుల వల్లే ఈ పరిస్థితి అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇక శివారు ప్రాంత ఫిర్జాదిగూడ, బోడుప్పల్, దుండిగల్ మున్సిపాల్టీల్లో కంకరతేలి మోకాల్లోతున గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో గ్రేటర్ పరిధిలోని వారాసిగూడ, సీతాఫల్‌మండి, చిలకలగూడ, రాంనగర్, రాజేంద్రనగర్ ప్రాంతాల్లో ఏర్పడిన గుంతలను పూర్చడం లేదని పలువురు పేర్కొంటున్నారు. దీంతో ఆయా ప్రాంతాలత్లో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. నగర శివారు ప్రాంతాలు నిజాంపేట, దుండిగల్, మణికొండ మున్సిపాలిటీల ప్రాంత రహదారుల్లో పరిస్థితి మరీ అధ్వాన్నంగా మారింది. తాగునీటి, డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్విన రోడ్లను పునరుద్ధరించలేదు. శంకర్‌మఠం కూరగాయల మార్కెట్-బాగ్‌లింగంపల్లివెళ్లే రహదారి, రాంనగర్-అచ్చయ్యనగర్-పద్మాకాలనీ నాలాపనులు ఇప్పటికీ పూర్తికాలేదు. కాగా, వర్షాలు వస్తున్నాయంటే నీరు నిలిచి రోడ్లు పాడవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇందులో కొంత వాస్తవం ఉన్నా..శాస్త్రీయ విధానంలో రోడ్డు నిర్మించక పోవడమే వరద నీరు నిలిచేందుకు ప్రధాన కారణమని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు.



మల్లంపేట్ రోడ్డు

## మద్యం గొలుసు దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

**పంజాగుట్ట జూన్ 23 (ప్రభాతవార్త):**

నగరంలో పలు ప్రాంతాలలో అక్రమ మద్యం విక్రయిస్తున్న నిర్వాహకులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. హైదరాబాద్ నగరంలోని బోరబండ, బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న గొలుసు దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. తనిఖీలలో నిందితులు శ్రీనివాస్, మల్లేష్‌లను అదుపులోకి తీసుకుని వారి నుండి రూ.1.6లక్షల విలువైన 48 లీటర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వనపర్తి వాసి మృతి

**జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద ఘటన..**

**పంజాగుట్ట, జూన్ 23 (ప్రభాతవార్త):** బైక్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... వనపర్తికి చెందిన రవిశంకర్ జీవనోపాధి కోసం కొంతకాలంగా నగరంలో జీవిస్తున్నాడు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిమీద వాహనంపై జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చే సమయానికి రవిశంకర్ మృతి చెంది ఉన్నాడు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# భారీ వర్షం..రహదారులు జలమయం



హబ్సీగూడలో కురుస్తున్న వర్షం



చెరువుగా మారిన బెగంబజార్

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త**

ఉపరితల ఆవర్తనంప్రభావంతో నగరంలో పలు చోట్ల ఆదివారం భారీ వర్షం కురిసింది. ఎల్బీనగర్, మియాపూర్, చందానగర్, లింగంపల్లి, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, చంపాపేట్, సైదాబాద్, చాదర్‌ఘాట్, మలక్‌పేట్, కాచిగూడ, హిమాయత్‌నగర్ ముషీరాబాద్, దోమలగూడ, చిక్కడపల్లి, రాంనగర్, గాంధీనగర్, కవాడిగూడ, అడిక్‌మెట్, బాగ్‌లింగంపల్లి, ఆర్టీసి క్రాస్‌రోడ్డు, మెహదీపట్నం, మాసబ్‌ట్యాంక్, ఆసిఫ్‌నగర్, అత్తాపూర్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, బోరబండ, పంజాగుట్ట, అమీర్‌పేట, ఖైరతాబాద్, లక్డీకపూల్, నాంపల్లి, యూసుఫ్‌గూడ, కూకట్‌పల్లి, లింగంపల్లి, బాల్‌నగర్, చింతల్, కొండాపూర్, హైటెక్‌సిటీ, జూబ్లీహిల్స్,తార్నాక, రామంతాపూర్, బోడుప్పల్ ప్రాంతాల్లో కుండపోత వర్షం పడింది. దీంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వనస్థలిపురం వద్ద భారీ వర్షానికి హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వరదనీరు చేరింది. రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా..మరోవైపు రోడ్డుపై వరదనీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. చింతల్‌కుంట వద్ద ట్రాఫిక్ జామ్ అయింది. వరదనీటిలో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. గుడిమల్కాపూర్‌లో భారీ వర్షం కురవడంతో వాహనదారులను వర్షం నీరు ముంచెత్తింది. ఒక్కసారిగా భారీ వర్షం కురవడంతో పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. రోడ్లపై వాహనాలు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు.



మాట్లాడుతున్న సతీష్‌బాబు

## టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రకటించాలి

**సైఫాబాద్, జూన్ 23 (ప్రభాతవార్త):** గత బిఆర్ఎస్ ప్రభుత్వం టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసిందని, కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన న్యాయం చేయాలని తెలంగాణ రికగ్నైజ్డ్ టైప్ రైటింగ్, షార్ట్ హ్యాండ్ అండ్ కంప్యూటర్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆదివారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.సతీష్‌బాబు, వెంకటేశం, కోశాధికారి వివేక్ తదితరులు మాట్లాడుతూ గ్రూప్-3, గ్రూప్-4 నోటిఫికేషన్స్‌ల్లో టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులు పెంచాలని సిఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత జనవరిలో తమిళనాడు రాష్ట్రంలో 2 వేలు టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రభుత్వం ప్రకటించి నిరుద్యోగులను అదుకుందని వారు గుర్తుచేశారు. తమిళనాడు తరహాలో రాష్ట్ర ప్రభుత్వం కూడా టైపిస్ట్, స్టెనోగ్రాఫర్ పోస్టులను ప్రకటించి నిరుద్యోగులను అదుకోవాలని, అలాగే గ్రూప్-2, గ్రూప్-3 నోటిఫికేషన్స్‌లో పోస్టులను పెంచాలన్నారు. 5 ఏళ్లకొకసారి వేసే జంబో నోటిఫికేషన్‌లో కేవలం 5, 6 పోస్టులు ప్రభుత్వం ప్రకటించి నిరుద్యోగులను నిరాశకు గురిచేయరాదన్నారు. టైపింగ్, స్టెనోగ్రఫీలో ఉత్తీర్ణత సాధించిన లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం నిరుద్యోగులను, టైప్ ఇనిస్టిట్యూట్‌లను అదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు సత్యవతి, ఎం.రాధ తదితరులు పాల్గొన్నారు.

### రాహుల్ ప్రియాంకగాంధీ సేన (కాంగ్రెస్)
## రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహ్మద్ ఫయాజ్



మహ్మద్ ఫయాజ్‌కు కాంగ్రెస్ కండువా కప్పుతున్న వేణుగోపాల్

**బేగంపేట జూన్ 23, ప్రభాతవార్త :** రాష్ట్రంలో రాహుల్ ప్రియాంక గాంధీ సేన (కాంగ్రెస్)ను మరింత బలోపేతం చేస్తానని రాహుల్ ప్రియాంక గాంధీ సేన(కాంగ్రెస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫయాజ్ అన్నారు. బేగంపేటలోని తన కార్యాలయంలో మహ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకం ఉంచి తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు కిరణ్‌కుమార్,ఉపాధ్యక్షులు ఎం.శ్రీధర్‌రావు,జాయింట్ సెక్రటరీ టి.రాజేష్‌తోపాటు కే సీ వేణుగోపాల్, సల్మాన్ ఖుర్షీద్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ప్రతి జిల్లాలో రాహుల్ ప్రియాంక గాంధీ సేన (రాంగ్రెస్) కమిటీలు వేస్తామని,జిల్లా స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు.త్వరలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కమిటీల నియామకం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నేతల సహకారంతో కమిటీల నియామకం చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

## విద్యార్థులకు నిరంతర అభ్యాసం ఎంతో అవసరం

### -ప్రముఖ సినీనేపథ్య గాయకుడు ప్రభు

**చిక్కడపల్లి, జూన్ 23 (ప్రభాతవార్త):** నేటి వేగవంతమైన ప్రపంచంలో నిరంతర అభ్యాసం, జ్ఞానం ఎంతో అవసరమని ప్రముఖ సినీనేపథ్య గాయకుడు ప్రభు అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ (ఎంబిఎ) కళాశాల ఆవరణలో 2022-2024 బ్యాచ్ వీడ్కోల సభ జరిగింది. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ కె.సునంద మార్గదర్శకత్వంలో ఈ కార్యక్రమం లో డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్స్, అకాడమిక్ ప్రిన్సిపాల్ తదితరులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా ప్రభు మాట్లాడుతూ విద్యార్థులు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన ఎదుగుదల పట్ల ఆసక్తిగా నిబద్ధతతో ఉండేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఎంబిఎ కళాశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పాటలు, నృత్యాలు, ఆటపాటలతో ప్రాంగణమంతా హోరెత్తింది. విద్యార్థుల సృజనాత్మకతను, స్ఫూర్తిని తెలియజేస్తూ ఆనందభరితమైన వేడుకల జరిగాయి.

## సెప్టెంబరు 9న ఛలో హైదరాబాద్



మాట్లాడుతున్న భూక్యా సంజీవ్‌నాయక్

**చిక్కడపల్లి, జూన్ 23 (ప్రభాతవార్త):** జనాభా ప్రాతిపదికన ఎస్టీలకు రిజర్వేషన్‌లు, ఏజెన్సీ ప్రాంతంలో 100శాతం ఉద్యోగవకాశాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 9న ఛలో హైదరాబాద్ నిర్వహించబోతున్నట్లు సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్యా సంజీవ్‌నాయక్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు ఇస్తామన్న 12శాతం రిజర్వేషన్‌ల హామీని నిలబెటుకోవడంతో పాటు ఉన్న 10శాతం రిజర్వేషన్‌ను కాపాడాలని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సేవాలాల్ సేనా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు జరిగిందది. ఈ సందర్భంగా రాష్ట్ర అడహాక్ కమిటీతో పాటు వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకున్నారు. అనంతరం భూక్యాసంజీవ్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీవో-33 స్థానంలో మరో జీవోను ఇచ్చి ఏజెన్సీ ప్రాంతంలో 100శాతం ఉద్యోగాలు గిరిజనులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మాలోత్ సైదా నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్‌మహారాజ్ నాయక్, గ్రేటర్ అధ్యక్షుడు వి.కల్యాణ్‌నాయక్, హుస్సేన్‌నాయక్, ఓబన్ననాయక్, భాస్కర్‌నాయక్ వెంకన్ననాయక్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ప్రభుత్వప్రోత్సాహం : జంపన ప్రతాప్.

**బేగంపేట జూన్ 23,ప్రభాతవార్త :** క్రీడా కారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రోత్సహిస్తుందని కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ అన్నారు. ఒలిపిక్ డే సందర్భంగా ఆదివారం సికింద్రాబాద్ జింఖానా మైదానం నుంచి ఎల్బీస్టేడియం వరకు జరిగే ఒలిపిక్ రన్ లో హైదరాబాద్ జిల్లా యువజన క్రిడా విభాగం అభివృద్ధి అధికారి సుధాకర్,వెటరన్ అథ్లెట్ మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇతర క్రీడాకారులతో కల్సి జంపన ప్రతాప్ ఒలిపిక్ రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ ప్రతి ఏడు క్రీడీకారులతో క్రీడాశిక్షకులతో కల్సి ఒలిపిక్ అసోసియేషన్ నిర్వహించే ఒలిపిక్ రన్‌లో పాల్గొంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుకుమార్ గౌడ్, మునిరాజ్, జయరాజ్, జగదీష్, జంపన రవి, సాయిబాబా యాదవ్, వివిధ క్రీడాశిక్షకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

## బిఆర్.అంబేద్కర్ కళాశాలలో యోగా దినోత్సవం

**చిక్కడపల్లి, జూన్ 23 (ప్రభాతవార్త):** సంపూర్ణ ఆరోగ్యానికి యోగా గొప్ప సాధనంగా నిలుస్తుందని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎన్.రిషికాంత్, లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగాసనాలు, సూర్యనమస్కారాలు యోగా ట్రైనర్ కె.మోనాలిక యోగకు అనుసరించాల్సిన పద్ధతులను విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.భవానీ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ బి.శ్రీధర్, ఎన్.కుమారస్వామి, ఎన్.స్వప్న, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు టి.శ్రావణ్, పి.మహేందర్, జె.పాండులు పాల్గొన్నారు.

# గోపన్‌పల్లి చెరువులో చనిపోయిన చేపలు



గోపన్‌పల్లి చెరువులో చనిపోయిన చేపలు

**గచ్చిబౌలి, జూన్ 23 (ప్రభాతవార్త)**

శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపన్‌పల్లిలో గల చిన్న పెద్ద చెరువులో కలుషిత నీటి కారణంగా చేపలు మ ృతిచెందాయి. లక్షలరూపాయలు వెచ్చించి మత్స్యకారులు పెంచిన చేపలు కలుషిత నీటి కార ణంగా చనిపోవడంతో తమకు న్యాయం చేయాలని మత్స్యకారులు వాపోతున్నారు. గోపన్‌పల్లి చిన్న పెద్ద చెరువులో సీవరేజీ ట్రీట్‌మెంట్ ప్లాంటు ఉన్నా పరిసర ప్రాంతాలకు చెందిన డ్రైనేజీ నీటిని నేరుగా చెరువులోకి వదలడంతోనే చేపలు మ ృతిచెందాయని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి చెరువు వద్దకు చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో సైతం ఇదే తరహాలో గోపన్‌పల్లి చిన్నపెద్ద చెరువులో పెద్దఎత్తున చేపలు చనిపోయాయని అన్నారు. ఎస్‌టిపి ప్లాంట్ ఉన్నా ఉపయోగం లేకుండా పోయిందని, పరిసర ప్రాంతాలకు చెందిన డ్రైనేజీ నీటిని నేరుగా చెరువులోకి వదులుతున్నారని అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చేపలు చనిపోయాయని వాపోయారు. గతంలో ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. చనిపోయిన చేపల కారణంగా చెరువు నీరు మరింత కలుషితం కాకుండా వెంటనే మ ృతి చెందిన చేపలను తొలగించాలని సూచించారు. నెలల పాటు పెంచిన చేపల చనిపోవడంతో స్థానిక మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని, వారిని అదుకునేందుకు చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో రంగస్వామి, నగేష్, విక్రమ్,



ఒలంపిక్‌రన్‌లో పాల్గొన్న కొండా విజయ్‌కుమార్ తదితరులు

## గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఒలంపిక్ దినోత్సవం

**గచ్చిబౌలి, జూన్ 23 ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని గచ్చిబౌలిలోని జిఎంసీ బాలయోగి స్టేడియం హాకీ గ్రౌండ్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒలంపిక్ దినోత్సవ వేడుకలకు హాకీ తెలంగాణ అధ్యక్షుడు కొండా విజయ్‌కుమార్ ముఖ్యఅతిధిగా హాజరై హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఒలంపిక్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించిన కొండా విజయ్‌కుమార్ స్వయంగా రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మరికొన్ని రోజుల్లోనే ప్రారంభం కానున్న పారిస్ ఒలంపిక్స్‌లో భారత క్రీడాకారులు అత్యుత్తమంగా రాణిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జాతీయ క్రీడ హాకీలో ఈ దఫా భారత్‌కు పతకం తీసుకురావడం ఖాయమని, ఇతర క్రీడల్లోనూ భారత క్రీడాకారులు సత్తా చాటేందుకు ఎదురుచూస్తున్నారన్నారు. జాతీయ క్రీడ హాకీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు రాష్ట్రంలో పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ఎంతోమంది తెలంగాణ హాకీ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమంగా రాణిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో హాకీ తెలంగాణ కార్యదర్శి భీంసింగ్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల హాకీ కార్యదర్శులు వేణు, భాస్కర్‌రెడ్డి, కోచ్‌లు జ్యోతి, సోనీలతో పాటు తెలంగాణ జిల్లాలకు చెందిన హాకీ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఆర్‌పురం కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు



నూతన కమిటీకి నియామక పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి

**యూసుఫ్‌గూడ, జూన్ 23, ప్రభాతవార్త :** ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి జరిగే ఎన్ఆర్ఆర్‌పురం కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఎన్నికలు ఆదివారం జరిగాయి.ఈ ఎన్నికల్లో యూసుఫ్ అధ్యక్షుడిగా గెలుపొందారు. సభ్యులుగా చట్ల ఎల్లయ్య, సి.అమృత, అక్తార్ సుల్తానా, షేక్ యూసుఫుద్దీన్, మహ్మద్ హిమామ్ గౌరి, సి.సత్యనారాయణ, సిఎస్ రామ్ మోహన్‌రావు, మహ్మద్ అలీ, ఏ.సత్తాజి, ఎ.ఎస్ సాయినాత్ రావు, మహ్మద్ అబ్దుల్ రహమాన్ తదితరులు ఎన్నికయ్యారు.

## మంచి సంగీతం
## మానసిక ప్రశాంతతను అందిస్తుంది

### -మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి

**చిక్కడపల్లి, జూన్ 23 ప్రభాతవార్త):** మంచి సంగీతం మానసిక ప్రశాంతతను అందిస్తుందని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీత్యాగరాయ గానసభలో బాలాజీ ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ సర్వీసెస్ సంయుక్త ఆధ్వర్యంలో పద్మవిభూషణ్ డాక్టర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 78వ జయంతి కార్యక్రమం నిర్వాహక సంస్థ అధినేత, గాయకుడు టి.రామోజీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో నిర్మాత, దర్శకులు తుమ్మలపల్లి రామసత్యనారాయణ, వీణావిద్వాన్, సుప్రసిద్ధ వీణా విద్వాంసురాలు వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు హోల్డర్(వీణ) డాక్టర్ ఏఎస్.మాధురి, ప్రముఖ న్యాయవాది బి.చక్రపాణి, గాయకుడు సుబ్బిరెడ్డి, పురుషోత్తమ్, డాక్టర్ కెఎస్‌విఎస్.ప్రసాద్, కామేశ్వరరావు, ఆర్‌వి.సుబ్రహ్మణ్యం, గాయనీమణులు నాగమణి, లక్ష్మీగోపాల్, కరుణ, ఆనందలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు గాయకుడు టి.రామోజీ స్వరసారధ్యంలో 'శంకరా.. నాదశరీరాపరా... వేదవిహారా హరా...జీవేశ్వరా' పేరుతో తెలుగు హిందీ సినీసంగీతవిభావరి అందరిని అలరించింది. సాంఘిక, సాంస్కృతిక సేవారత్న అవార్డులను న్యాయవాది డాక్టర్ బర్మా చక్రపాణి, బెస్ట్ యాడ్‌ఫిలిం డైరెక్టర్ బ్రహ్మర్షి విశ్వామిత్రకు అందించారు.



ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

## పారిస్ ఒలంపిక్స్‌లో సత్తా చాటాలి

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** అంతర్జాతీయ ఒలంపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్బీస్టేడియంలో ఒలంపిక్ రన్‌ను ఉత్సహంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌లు హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి 9 కూడళ్ల నుంచి వచ్చిన ఒలంపిక్ క్రీడాజ్యోతిలకు, క్రీడాకారులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు, మహేష్ కుమార్ గౌడ్‌లు క్రీడాకారులకు ఒలంపిక్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. పారిస్ ఒలంపిక్స్ భారతదేశ క్రీడాకారులు తమ సత్తా చాటి దేశకీర్తి ప్రతిష్టలను పెంచాలని, తెలంగాణ నుంచి బరిలోకి దిగుతున్న ప్లేయర్లు నిఖత్ జరీన్, ఆకుల శ్రీజ, ఈషాసింగ్‌లు కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో, ఒలంపిక్స్‌లో రాణించిన క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఒలంపిక్ సంఘం నాయకులు చాముండేశ్వరినాథ్, మాజీ కోశాధికారి మహేశ్వర్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్, బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ రహదారులు పరిశుభ్రతకు చర్యలు

### కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 23 ప్రభాతవార్త :** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ప్రతీ బస్తీ రోడ్డు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు.కాటేదాన్‌లోని బిజెపి పార్టీ కార్యాలయంలో శానిటేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రాజేంద్రనగర్‌నియోజకవర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండ రహదారులలో ఉన్న చెత్తా చెదారాన్ని ఎప్పటి కప్పుడు తొలగించాలని తెలియజేశారు. పారిశుధ్య పనుల కార్మికులు సమస్యలను తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించటానికి తన శాయ శక్తుల కృషి చేస్తానని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి శానిటేషన్ డిపార్ట్‌మెంట్ డిఇ శ్రీనివాస్,శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేష్,ఎస్ఎఫ్ఎ టీమ్ సిబ్బందితో పాటు పలువురు పాల్గొన్నారు.

## 80 కేజీల గంజాయి స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు

**పేట్‌బషీరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ ఎన్‌ఫోర్స్ మెంట్ ఉమ్మడి రంగారెడ్డి పరిధిలో ఆదివారం 80 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు బాచుపల్లి ఎక్స్ రోడ్డులో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులు ఇచ్చిన సమాచారంతో ఖాజీపల్లిలోని స్థావరంపై దాడి చేసి, అక్కడ దాచిని 76 కేజీల గంజాయి, 2 ఆటోలు, 1 బైక్, 4 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 80 కేజీల గంజాయి విలువ 22లక్షల వరకు ఉంటుందని అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెంట్ జీవన్ కిరణ్ తెలిపారు.



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న బడేసాబ్, రామకృష్ణ, చంద్రప్రకాష్‌రెడ్డి తదితరులు

### తెలుగు విశ్వవిద్యాలయానికి
## సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలి

**రవీంద్రభారతి, జూన్ 23 ప్రభాతవార్త :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రాష్ట్ర విభజన తర్వాత 10వ షెడ్యూల్‌లో ఉన్నందున ఇప్పుడు ఆకాలపరిధి పూర్తయిన సందర్భంగా ఆ విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టాలని రాష్ట్రంలోని వివిధ ప్రముఖ సాహితీ సంస్థల అధినేతలు ఆదివారం రవీంద్రభారతి ప్రాంగణం కళాభవన్‌లోని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, ఎక్సైజ్‌శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావును ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వినతిపత్రాన్ని అందించిన తెలుగుభాషా చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు పి.బడేసాబ్, దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షుడు రామకృష్ణ చంద్రమౌళి, గోల్కొండ సాహితీ కళాసమితి అధ్యక్షుడు అర్థ చంద్రప్రకాష్ రెడ్డి, తెలుగు కవితా వైభవం అధ్యక్షుడు మేక రవీంద్ర, లక్ష్యసాధన ఫౌండేషన్ చైర్మన్ ఘంట మనోహర్‌రెడ్డి, సంపంగి నరసింహులు, నరసింహశర్మ, అక్కి నరసింహులుగౌడ్ తదితరులు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కృష్ణగౌడ్



తొలుపునూరి కృష్ణగౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న రోహిన్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తొలుపునూరి కృష్ణగౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిన్‌రెడ్డి ఈ మేరకు ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కష్టపడే ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. భవిష్యత్తులో పార్టీ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపు నిచ్చారు. తొలుపునూరి కృష్ణగౌడ్ మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన మాజీ పిసిసి అధ్యక్షుడు వి.హనుమంతరావు, డాక్టర్ రోహిన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడి, వచ్చే ఎన్నికల్లో పార్టీ జెండా ఎగిరే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి లక్‌పతి యాదగిరిగౌడ్, మాజీ లేబర్ బోర్డు వైస్‌చైర్మన్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో అన్ని రకాల స్పౌజ్ కేసులను పరిగణనలోకి తీసుకోవాలి: జెఎసి



ముఖ్యమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న జెఎసి నాయకులు

**ఎల్‌బినగర్, జూన్ 23 ప్రభాతవార్త:** గురుకులాల్లో జిఓ 317 అమలులో అన్ని స్పౌజ్ కేసులను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జెఎసి నాయకులు వినతిపత్రం సమర్పించారు. స్పౌజ్ విషయంలో కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను మాత్రమే పరిగణనలోకి తీసుకోకుండా సెంట్రల్ గవర్నమెంట్, జుడీషియరి, రైల్వే, బ్యాంకులు, ఇతర పబ్లిక్ సెక్టార్‌లను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.2022లో జరిగిన కేటాయింపు తర్వాత ఉన్నటువంటి అన్ని మెడికల్ కేసులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ టీచర్స్‌కు ఇస్తున్నటువంటి బదిలీల అవకాశాన్ని అన్ని రకాల గురుకుల పాఠశాలలకు కూడా వర్తింప చేయాలని జెఎసి నాయకులు ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ మధుసూధన్, కార్యనిర్వాహక కార్యదర్శి కె.జనార్దన్, టిజి సోషల్ వెల్ఫేర్ అధ్యక్షులు ఎ.నరసింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌యాదవ్‌కు నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

## డ్యూటీకి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

**ముషీరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:** ఆఫీస్ డ్యూటీకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి వ్యక్తి కనిపించకుండా పోయిన ఘటన గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ డి.రాజు తెలిపిన వివరాల ప్రకారం బస్తీ లాల్‌పేటలో నివసించే ఎం.వెంకటేష్(22) స్విగ్గీలో డెలివరీబాయ్‌గా పని చేస్తున్నాడు. గతనెల 30వ తేదీ మధ్యాహ్నం డ్యూటీకి వెళ్తున్నానని భార్య సంగీతకు చెప్పి వెళ్లాడు. డ్యూటీకి వెళ్లిన వెంకటేష్ తిరిగి ఇంటికి రాకపోగా, ఫోన్ చేస్తే కూడా ఎత్తలేదు. వెంకటేష్ భార్య బంధువులు, స్నేహితులు, తెలిసిన ప్రాంతాలలో భర్త ఆచూకీకోసం వెతికినప్పటికీ ఫలితం లేకపోవటంతో గాంధీనగర్ పోలీసులను ఆశ్రయించింది. వెంకటేష్ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదుచేసి, దర్యాప్తు ప్రారంభించామని సీఐ తెలిపారు.

## సెలూన్ షాప్‌లో అగ్ని ప్రమాదం

**పేట్ బషీరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో అగ్ని ప్రమాదం జరిగింది. సుచిత్రలో గల ఉప్పల సెలూన్ ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. మంటల ధాటికి సెలూన్ పూర్తిగా దగ్ధం అయ్యింది. దట్టమైన పొగలు రావడంతో సెలూన్‌పై అంతస్తులోగల ముగ్గురు యువతలు స్వల్పఅస్వస్థతకు గురయ్యారు. వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. అగ్నిప్రమాదంలో ఎలాంటి ప్రాణం నష్టం ఏమీ జరగలేదని చెప్పారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# స్నాచింగ్ కేసులో ఇద్దరి అరెస్టు...చోరీ సొత్తు స్వాధీనం

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:**

నగరంలోని మలక్‌పేట్ పరిధిలో ఈ నెల 18వ తేదీన జరిగిన స్నాచింగ్ ఘటనలో మిస్టరీ వీడింది. ఈ నేరానికి పాల్పడ్డ నేర గాడితో పాటు, చోరీ చేసిన బంగారు గొలుసును ఖరీదు చేసిన నగల దుకాణం యజమానిని కూడా అరెస్టు చేసి, వారి వద్ద నుంచి నాలుగు తులాల బంగారు నగను జప్తు చేశారు. టాస్క్‌ఫోర్స్ డిసిపి రష్మీ పెరుమాళ్ దీనికి సంబంధించిన వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన గటాడి సాయి కుమార్ (26) మహిళల బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఇదే సమయంలో ద్విచక్ర వాహనాన్ని తీసుకుని ర్యాపిడో డ్రైవర్‌గా కూడా పనిచేస్తున్నాడు. కొంతకాల ంగా ఇతను నగరంలోని సరూర్‌నగర్‌లో వున్నాడు. అయితే బ్యూటీషియన్‌గా, ర్యాపిడో డ్రైవర్‌గా ఆశించినంత సంపాదన రాకపోవడంతో ఇతను పక్కదారి పట్టాడు. అ నంతరం ఒంటరిగా వెళ్లే వారిని టార్గెట్ చేసి స్నాచింగ్‌లకు పాల్పడాలని నిర్ణయించాడు. ఇందులో భాగంగా తన ద్విచక్ర వాహనం నంబర్ ప్లేట్ తొలగించి ఈ నెల 18 వ తేదీన రాత్రి తొమ్మిది గంటల సమయంలో మలక్‌పేట్‌లోని ముంతాజ్ కాలేజి వద్ద ఒంటరిగా వెళుతున్న వయోధిక మహిళపై రెప్పపాటులో దాడిచేసి ఆమె మెడలో ని నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. స్నాచింగ్ తరువాత అదేరోజు రాత్రి తన సొంత ఊరు ఆర్మూరుకు వెళ్లి చోరీ చేసిన నాలుగు తులాల బంగారు గొలుసును తనకు తెలిసిన వ్యక్తి అదే ప్రాంతంలోని బాలాజి నగల దుకాణం యజమాని కూడా అయిన శ్రీరాం శ్రీనివాస్ (41)కు లక్షా 30 వేల రూపాయల కు అమ్మాడు. కాగా స్నాచింగ్‌పై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేబట్టారు. దీనిపై రంగంలో దిగిన తూ ర్పు, దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు సిసి ఫుటేజిలను పరిశీలించి అందులోని ఫోటోలు, ఇతర సాంకేతిక ఆధారాల ద్వారా ఈ నేరానికి పాల్పడింది సాయి కుమార్‌గా తేల్చారు. నిందితుడిని శనివారం రాత్రి అరెస్టు చేసి విచారించగా తన నేరాన్ని అంగీకరించాడు.

అనంతరం అతని వద్ద నుంచి చోరీ అయిన బంగారు గొలుసు ను ఖరీదు చేసిన శ్రీరాం శ్రీనివాస్‌ను కూడా అరెస్టు చేశారు. ఇతని వద్ద నుంచి చోరీ అయిన మూడున్నర లక్షల రూపాయల విలువ చేసే నాలుగు తులాల బంగారు గొలుసును జప్తు చేశారు. దీంతో పాటు చోరీ సమయంలో సాయి కుమార్ వాడిన ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్‌ను జప్తు చేశారు. టాస్క్‌ఫోర్స్ అదనపు డిసిపి అందె శ్రీ నివాస్ నేతృత్వంలోని పోలీసు బృందం ఇద్దరు నేరగాళ్లను పట్టుకుంది.


సమావేశంలో మాట్లాడుతున్న బత్తుల రాంప్రసాద్

### దళిత అధికారిని కులం పేరుతో దూషించిన
## ఉన్నతాధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలి
### విజిలెన్స్ మానటరింగ్ కమిటి డిమాండ్

**సైఫాబాద్, జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్ర సచివాలయంలో దళిత మహిళా అధికారిని కులం పేరుతో దూషించిన అగ్రకుల ఉన్నతాధికారిపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని విజిలెన్స్ మానటరింగ్ కమిటీ హైదరాబాద్ జిల్లా సభ్యులు బత్తుల రాంప్రసాద్, బోయిని ఎల్లేష్‌మాదిగ హెచ్చరించారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సచివాలయంలో ఆర్థిక శాఖ విభాగంలో జాయింట్ సెక్రటరీ హోదాలో పనిచేస్తున్న దళిత మహిళా అధికారిని ఇదే శాఖలో పని చేస్తున్న డిప్యూటీ సెక్రటరీ హోదాలో ఉన్న ఎం.పద్మావతి ఆమెను గత మార్చి నెలలో అకారణంగా కులం పేరుతో దూషిస్తూ ఆ శాఖ వాట్సప్ గ్రూప్‌లో పోస్ట్ పెట్టారని ఆరోపించారు. ఈ విషయం తెలిసిన ఫైనాన్స్ ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణరావు ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అతన్ని తక్షణమే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. బాధిత దళిత అధికారణిని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి పోలీసులు ఏలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దూషించిన అధికారిణిపై ఎస్సీ,ఎస్టీ చట్టంకింద చర్యలు తీసుకోవాల్సిన పోలీస్ అధికారులు నిర్లక్ష్యం చేసి కాంప్రమైజ్ చేస్తామంటూ బాధితురాలికి చెప్పి తీవ్ర మనోవేదనకు గురి చేశారని వారు తెలిపారు. ఈ విషయంలో పోలీసు ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, త్వరితగతిన సమగ్రంగా విచారణ జరిపి నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఎన్.దాస్, శివ, అనిల్, బలరామ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘననివాళి



డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బిజెపి నాయకులు

**అత్తాపూర్ జూన్ 23,ప్రభాతవార్త :** జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఉన్నత ఆశయాలు దేశం అంతటా లక్షలాది మందికి ప్రేరణను అందిస్తున్నాయని బిజెపి నేతలు పేర్కొన్నారు. ఆదివారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్, జిల్లా కార్యదర్శి మొంద్ర కొమరయ్య, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, కాడేం సుధాకర్, మొంద్ర నరసింహ శబాధ విజయ్,సులిగే వెంకటేష్,నల్లింగ్ రమేష్, జయనంద్‌రెడ్డి, రావుల జగన్, కాకుళారం కృష్ణ, బాలకృష్ణ, శ్రీరామ్ పాల్గొన్నారు.

**బౌద్దనగర్‌లో...**



శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

**సికింద్రాబాద్, జూన్ 23 ప్రభాతవార్త :** దేశంకోసం ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన యోధుడు భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యావ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవిప్రసాద్‌గౌడ్ తెలిపారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ పురస్కరించుకొని బౌద్ధనగర్ అన్నపూర్ణ మెస్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిప్రసాద్‌గౌడ్ మాట్లాడుతూ ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్ ఓర్ దో నిషాన్ నహీ ఛలేంగే (ఒకే దేశానికి రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జాతీయ చిహ్నాలు ఉండకూడదు) అని కాశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దుకోసం ప్రాణాలర్పించారని తెలిపారు.కార్యక్రమంలో నేతి సత్యనారాయణ, భాస్కర్ గౌడ్, సురేష్, సంపత్, సుధాకర్‌గుప్త, ఆర్వి రమణ, ఓంప్రకాశ్, పాండు, రాజ్‌కుమార్, సుబ్బారావు, భాస్కర్, పద్మారావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

## బోనాల జాతర ప్రత్యేక నిధుల మంజూరుకు కృతజ్ఞతలు

**సికింద్రాబాద్, జూన్ 23 ప్రభాతవార్త :** సికింద్రాబాద్, హైదరాబాద్‌లలో జరిగే బోనాల ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 20 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి బోనాల జాతరకు హైదరాబాద్ జిల్లాకు రూ. 25 కోట్లు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరినట్లు ఆదివారం ఓ ప్రకటనలో వివరించారు. ఈ విషయంలో స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల జరిగిన బోనాల పండుగ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ దృష్టికి తీసుకువెళ్లి తద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సిఫార్సు చేయడం ప్రసంసనీయమని తెలిపారు.

### ఘనంగా శ్రీకనకదుర్గ మాత ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**పేట్ బషీరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్లలోని మెయిన్‌రోడ్ పక్కన వెలసిన శ్రీకనకదుర్గమాత ఆలయ 12వ వార్షిక మహోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షులు ధమ్మని శ్రవణ్‌కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిట్ల ప్రవీణ్ కుమార్, జయరాం నగర్ నర్సింగ్, కమిటీ సభ్యులు కాళ్ల శంకరయ్య, లింగ బాలరాజు ముదిరాజ్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న డిసిసి ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్

# జీవితానికి పరిపూర్ణత ఇచ్చేది యోగా


సి.ఎస్.ఆర్. ప్రభును సత్కరిస్తున్న ఆకెళ్ల ఫౌండేషన్ నాయకులు

**హైదరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త:**
మానవ జీవితానికి పరిపూర్ణత నిచ్చేది యోగానేనని ప్రముఖ యోగాచార్యులు డాక్టర్ సి.ఎస్.ఆర్.ప్రభు అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో భాగంగా నగరంలో ప్రసిద్ధి చెందిన స్వచ్ఛంధ సంస్థ ఆకెళ్ల ఫౌండేషన్ నిర్వహించిన యోగా శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభు మాట్లాడుతూ యోగా వల్ల ధర్మరక్షణకు మార్గం సుగమయం అవుతుందని తెలిపారు. అందుకే అన్ని మతాలలో ఈ విధానం ఉందని స్పష్టం చేశారు. యోగా చార్యులు ఏ.వీరభద్రశాస్త్రి యోగాభ్యాసం మెలకులను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగాభ్యాసం లోని మెలకువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. ఒక పద్ధతి ప్రకారం యోగ సాధన చేస్తే జీవితం ఆనంద కరమవుతుందని అన్నారు. ప్రొఫెసర్ ఏ.శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు ఏ.రవికుమార్, ఏ.రామ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

## కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, జూన్ 23 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఆదివారం 5వ వార్డులోని శ్రీపురి కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు నిర్వహించిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిధిగా హాజరై ప్రసంగించారు. రోడ్లు,డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్ వంటి మౌళిక సదుపాయాల రూపకల్పనకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్, కాలనీ ప్రతినిధులు ప్రదీప్ రాజ్, భరత్, రామ్ దీప్ రాజ్, రాజేశ్వర్, సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

### తలసాని శంకర్‌యాదవ్ సేవలు ఎనలేనివి : శ్రీనివాస్‌యాదవ్


బోయిన్‌పల్లి మారె్కట్‌లో అన్నదానం చేస్తున్న తలసాని కుటుంబ సభ్యులు

**కంటోన్మెంట్,జూన్ 23 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి మోండా మారె్కట్‌లలో పనిచేసున్న కార్మికుల,వర్తకుల సంక్షేమం కోసం తలసాని శంకర్ యాదవ్ చేసిన సేవలు ఎనలేనివని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ వెజిటేబుల్ కమిషన్ ఏజెన్స్ అసోసియేషన్స్ అధ్యక్షులు సోమ దేవేందర్ రెడ్డిలు తెలిపారు. కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల మృతి చెందిన సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం సోదరుడు తలసాని నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బోయిన్‌పల్లి మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్, బిఆర్ఎస్ నాయకులు టీ.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లాలో బదిలీలు, ప్రమోషన్లు చేపట్టాలి: పిఆర్‌టియు

**ఎల్‌బినగర్, జూన్ 23 ప్రభాతవార్త:** రెండు దశాబ్దాలుగా పెండింగులో ఉన్న భాషా పండితులు, వ్యాయాయ ఉపాధ్యాయుల అప్‌గ్రెడేషన్ పూర్తి చేయించిన సందర్భంగా పిఆర్‌టియు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ వ్యవస్థాపకులు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మంచిరెడ్డి అనంతరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఉమాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సత్యనారాయణ, రాష్ట్ర గౌరవ సలహాదారు గజ్జల జనార్దన్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అనిరెడ్డి కృష్ణారెడ్డిలు మాట్లాడుతూ అక్రమంగా రంగారెడ్డి జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులందరిని న్యాయస్థానం తీర్పు అనుసరించి వారి స్వంత జిల్లాలకు పంపించి, రంగారెడ్డి జిల్లాలో పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని కోరారు. పిఎస్‌హెచ్ఎం పోస్టులు మంజూరుచేసి ఎస్‌జిటి ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని, సబ్ కమిటి రిపోర్టును తెప్పించుకుని జిఒ 317 బాధిత ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇప్పించాలని, పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఎంఐఎం హయాంలోనే పాతనగరం అభివృద్ధి
### ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

**చార్మినార్,జూన్ 23 ప్రభాతవార్త :** ఎంఐఎం హయాంలోనే పాతబస్తీ అన్ని రంగాల్లోను అభి వృద్ధి సాధించిందని ఎఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఐదవసారి ఎంపిగా ఘన విజయం సాధించిన అసదుద్దీన్ ఓవైసీని మహ్మద్ క్యాప్ మార్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ ఇలియాస్ బుఖారితోపాటు పలువురు కలిసి అభినంధిం చారు. ఈ సందర్భంగా ఎంపి అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ కొత్త నగరంతో సమానంగా పాతబస్తీని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు.మహ్మద్ ఇలియాస్ బుఖారీతో పాటు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న జిహెచ్ఎంసి చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్న, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు

### సకాలంలో బోనాల జాతర ఉత్సవాల
## అభివృద్ధి పనులు పూర్తి చేయాలి : గాజుల అంజయ్య

**చార్మినార్, జూన్ 23 ప్రభాతవార్త :** ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాల ప్రారంభానికి ముందే పాతబస్తీలోని అన్ని దేవాలయాల వద్ద అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జిహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్నతో పాటు పలు ఇంజనీరు శాఖలకు చెందిన అధికారులను కోరామని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.నర్కి పూల్‌బాగ్‌లో జోనల్ కమిషనర్ ఆధ్వర్యంలో జరిగిన కో-ఆర్డినేషన్ కమిటి సమావేశంలో అభివృద్ది పనులకు సంబంధించిన పలు అంశాలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటి మాజీ చైర్మన్ రాకేష్ తివారి,మాజీ ఉపాధ్యక్షులు మధుసూధన్ యాదవ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి వ్యక్తి భక్తి మార్గంలో నడవాలి

**చార్మినార్, జూన్ 23 ప్రభాతవార్త :** పాతబస్తీ దూద్‌బౌలి ఉందాబజార్‌లోని శ్రీసిద్ది బుద్ధి సమేత గణపతిస్వామి, శ్రీసీతారామ వీరాంజనేయ స్వామి వార్ల దేవస్థానముల 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. 22వ తేదీ నుంచి 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.కాగా సిర్పూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాల్వాయి డాక్టర్.హరీష్,మోండా మార్కెట్ డివిజన్ కార్పొరేటర్ దీపిక, గన్‌ఫౌండ్రీ డివిజన్ కార్పొరేటర్ సురేఖలు మందిరంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ వ్యక్తి భక్తి మార్గంలో నడవాలని కోరారు. రెండవరోజు దేవాలయంలో శ్రీసీతారాముల కళ్యాణం నిత్య పూర్ణహుతి, సామూహిక శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవాలయాల వంశ పారంపర్య ధర్మకర్త మహేశ్వరం శ్రీనివాసాచారి,మందిరం కమిటి ప్రతినిధులు నాగేశ్వరచారి, శ్రీనివాసచారి, వెంకటాచలం ముదిరాజ్, శశిరాజ్ జైస్వాల్, చందూ, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

## ఉత్తమ దంపతులకు పురస్కారాల ప్రదానం

**చిక్కడపల్లి, జూన్ 23 ప్రభాతవార్త:** జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధినేత గుదిబండి ఆధ్వర్యంలో 'సప్తపదిలో తోడునీడ' పేరుతో ఉత్తమ దంపతులకు పురస్కారాల ప్రదానోత్సవ సభ పారిశ్రామికవేత్త డాక్టర్ చిల్లా రాజశేఖరరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా దక్షిణమధ్యరైల్వే పూర్వ జనరల్ మేనేజర్ సి.రామకృష్ణ హాజరై ఈ పురస్కారాలను మెడికొండూరు నాగవర్థిని(సంగీతం)–మెడికొండూరూ విశ్వనాథ్, ప్రతాపని సునీత(వాయిస్ ఓవర్)–ప్రతాపని రమేష్, పేరి సూర్యకామేశ్వరరావు(కార్టూనిస్ట్)–పేరి (విశ్వనాథ) శైలజ, కుప్పా పద్మిని (టీవీయాంకర్)–అరుణ్‌కుమార్, డి.తిరుమలేశ్వరరావు(కళారంగం)–జి.రాజేశ్వరి, ఆర్.సైదులు(జానపద సంగీతం)–ఆర్.శ్రీలక్ష్మి, పూదత్తు కృష్ణమోహన్(సైకాలజిస్ట్)– సునీతలకు అందించి గౌరవించారు. కార్యక్రమనికి వ్యాఖ్యతగా నీరజ అనకాపల్లి వ్యవహరించారు. ఆదర్శఫౌండేషన్ స్థాపక అధ్యక్షుడు కుసుమ భోగరాజు, పొత్తూరి సుబ్బారావు, సామాజికవవేత్త వసంతరాయలు, టీవీ యాంకర్ డి.శ్రీదేవి, ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వి.వి.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు శ్రీకీర్తి నృత్య అకాడమి డైరెక్టర్ 'నృత్యచూడామణి' డాక్టర్ సజనీ వల్లభనేని శిష్యులు వేటూరి కాంతితి, మాధురి, గుణ, అనుకీర్తన, అక్షధ, వేద తదితరులు అద్భుతంగా నృత్య ప్రదర్శన నిర్వహించారు.


పురస్కారాలను ప్రదానం చేసిన దృశ్యం


మాట్లాడుతున్న పబ్బుతి శ్రీకృష్ణ

### అత్యాచారం, హత్యాయత్నంపై సంఘటనపై
## సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

**సైఫాబాద్, జూన్ 23 ప్రభాతవార్త :** ఇటీవల కొల్లాపూర్ నియోజకవర్గంలోని మొల చింతపల్లిలో ఇసుక మాఫియా గుండాలు చెంచు మహిళపై అత్యాచారం చేసి, హత్యాయత్నం చేసిన సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సిట్టింగ్ జడ్జితోగాని కమిషన్‌తోగాని విచారణ జరిపించాలని, రాష్ట్ర హైకోర్టు ఈ విషయాన్ని సుమోటగా స్వీకరించాలని మాల మహానాడు కోరింది. బాధితురాలికి 25 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బుతి శ్రీకృష్ణ కోరారు. ఆదివారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన చెంచు మహిళ ఈశ్వరమ్మపై ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు కలిసి అత్యాచారంచేసి, పెట్రోల్‌పోసి దగ్ధం చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. అదృష్టవశాత్తు ఒక వ్యక్తి వల్ల ఆమె ప్రమాదం నుంచి బయటపడిందన్నారు. ఆమెతో మాఫియా వెట్టి చాకిరి చేయించున్నదని, దీనికిగాను డబ్బులు అడిగినందుకు మాఫియా ఆమె కాళ్లు, చేతులు కట్టేసి పచ్చికారం రసాన్ని జననేంద్రియాలతోపాటు, శరీరంపై రుద్ది పెట్రోల్‌పోసి చంపడానికి ప్రయత్నించారని ఆయన ఆరోపించారు. ఈ విషయం సోషల్ మీడియా ద్వారా బయట ప్రపంచానికి తెలిసేవరకు పోలీసులు, స్థానిక మంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. తాను స్వయంగా డిఎస్‌పి, సిఐతో మాట్లాడిన తరువాత శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు ఆమెను పరామర్శించడం జరిగిందన్నారు. తెలంగాణ గురుకులాల్లో విద్యార్థులు మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరాల విషయంలో అనేక ఇబ్బందులకు గురవు తున్నారని, అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో నాటి ఛైర్మన్ ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ మాల ఉద్యోగులకు తీరని అన్యాయం చేశారని తక్షణమే ప్రభుత్వం విచారణ చేపట్టాలని ఆయన కోరారు.

## దైవచింతనతో మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**పేట్‌బషీరాబాద్, జూన్ 23, ప్రభాతవార్త :** దైవచింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. ఆదివారం జీడిమెట్ల గ్రామంలోని శ్రీదుర్గదేవి ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై అమ్మవారి చల్లని చూపు ఉండాలని, సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బౌరంపేట్ కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్‌పార్టీ నాయకులు కుంటా సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కాలే నాగేష్, బాల మల్లేష్, బేకు ఆనంద్‌బాబు, శ్రీకాంత్, విజయ్ హరీష్, కాలే గణేష్, శ్యామల, ఆలయ కమిటీ సభ్యులు బాలరాజు, నవీన్, కుమార్, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### శివాజీ మహారాజ్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించేందుకు
## మద్దతు తెలిపిన ఓటర్లకు కృతజ్ఞతలు

**బేగంపేట జూన్ 23, ప్రభాతవార్త:** ఛత్రపతి శివాజీ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించేందుకు మద్దతు తెలిపిన ఓటర్లకు ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సీ డీ చవాన్ ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేసారు. ఆదివారం సికింద్రాబాద్ ఎస్‌డీ రోడ్ మినర్వా కాంప్లెక్సులో ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ఒకటవ వార్షిక కృతజ్ఞతలు, ప్రశంసా సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి 50 మంది మద్దతుదారులు, ఓటర్లు హాజరయ్యారు. అతిధులుగా యోగేశ్ ప్రభుజీ, అనిల్ కాలేకర్, పర్మేశ్వరి, వెంకట్‌దానధర్మ, చంద్రశేఖర్, వెంకటాచలం, శ్రీకాంత్, రాజేంద్ర యాదవ్ పాల్గొన్నారు. ఈ సందరభంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ పలు ప్రాంతాలలో నాయకులను నియమించారు. గణేష్‌తో సెల్ఫీపోటీలో గెల్చిన గౌతమ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసారు.శివాజీ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలంటూ 5000 మంది ఓట్లు వేసారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ సీ డీ చవాన్ మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ తన ప్రయాణాన్ని ఒక సాధారణ వ్యక్తి నుంచి మరాఠా సామ్రాజ్యానికి ఆదరణ పొందిన రాజుగా ఎదిగాడని కొనియాడారు.ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించేందుకు 07941055779కికాల్ చేసి ఓట్లు వేయాలని కోరారు.శివాజీ తన గెరిల్లా యుద్ధంలో ముందంజ వహించిన పాత్ర గోమాతల పట్ల తన భక్తిని చాటుకున్నారని గుర్తు చేసారు. శివాజీ మహారాజ్ యువతకు ఎందుకు ప్రేరణగా ఉండాలి అనే అంశాలపై చవాన్ చర్చించారు.


సమావేశంలో పాల్గొన్న సీ డీ చవాన్ తదితరులు

## ఒయు డి హాస్టల్ వద్ద తాచుపాము...
### భయాందోళనలో విద్యార్థులు

**తార్నాక, జూన్ 23 ప్రభాతవార్త :**
తరుచు ఒయూ క్యాంపస్‌లో పాములు కనిపిస్తూ భయాందోళనగు గురి చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా డి హాస్టల్ బాత్ రూం సమీపంలో సుమారు ఆరడుగుల త్రాచుపాము బుసలు కొడుతూ విద్యార్థులకు దర్శణమిచ్చింది.దీంతో పామును చూసిన విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు.పాము కొద్ది సమయం అనంతరం చెట్లపొదల్లోకి వెళ్లింది. ఓ.యూలో పాముల నియంత్రణ చేపట్టాలని విద్యార్థులు కోరారు.



# జులై 3న డిఎమ్ఈ కార్యాలయం ఎదుట ధర్నా

**సైఫాబాద్, జూన్ 23 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటి కార్మికలకు చెల్లించవలిసిన వేతనాలను సక్రమంగా చెల్లించకుండా కాంట్రాక్టర్లు, అధికారులు కుమ్మక్కై కార్మికులను దోచుకుంటున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.డి.యూసఫ్, ఎం.నర్సింహ్మా ఆరోపించారు. ఆదివారం ఎఐటియుసి భవన్‌లో జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు జివొ నెంబరు 60 ప్రకారం రూ. 15,600 కాగా పిఎఫ్, ఇఎస్ఐ కట్ కాగా రూ. 13,600 చెల్లించవలిసి ఉండగా కేవలం 11 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని, మరి కొన్ని ఆసుపత్రులలో 10 వేలు ఇస్తున్నారని ఆరోపించారు. ఇందుకు వ్యతిరేకంగా జులై 3వ తేదీన డిఎమ్ఈ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు లక్ష్మీబాయి, హసీనా బేగం, పి.సురేష్, దేవేందర్, సుధాకర్, కిష్టమ్మ, ఇమ్రాన్, వెంకటరాజ్యం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.డి.యూసఫ్

**IN THE COURT OF THE V SENIOR CIVIL JUDGE; CITY CIVIL COURT; HYDERABAD**
**O.S.No. 270 OF 2024**
Between :
**Smt. Gurram Bhasker Nirmala and another ...Plaintiffs**
AND
**Sri Ajay Singh & another ...Defendants**
To
**All Concerned ...Defendant No.2**
Whereas the plaintiffs have instituted above suit to declare them as only surviving legal heirs of late Sri Raj Vilas Gupta, who died intestate on 25-09-2018, in respect of all that the property bearing municipal No. 1-2-234/1/A, situated at S.B.H. Colony, Gagan Mahal, Domalguda, Hyderabad, consisting of Ground plus two upper floors, with 2,312 square feet of constructed area, admeasuring 122.22 square yards or equivalent to 102.19 square meters. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to suit or who shall be accompanied by some person able to answer all such questions on the 26th day of July, 2024 at 10.30 a.m. in the forenoon to answer claim and further you are hereby directed to file on that day a written statement of your defence and to produce on said day all documents in your possession or power upon which you base your defence.
Take notice that in default of your appearance on the day before mentioned the suit will be heard and determined in your absence as exparte.
(BY ORDER OF THE COURT)
**M/s. SHYAM S. AGRAWAL,**
**L. Praveen Kumar,**
**L. Pradhan Kumar**
**Advocates**
Office at # 101, R.K.Residency, Office, 3-6-237/1, Street No.15, Himayatnagar, Hyderabad-500029, **Phone: 2322-2700, Mobile No.988 567 3168.**

**IN THE COURT OF THE HON'BLE XI JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT : SECUNDERABAD**
**O.S. NO. 313 OF 2024**
BETWEEN:
**Dr. Duddu Mowliah Ramesh Kumar,** S/o. D S Mowliah, Aged about 82 years, Occ: Doctor, R/o. # 801, 8th floor, Seshamaraju Residency, Sivalayam Lane, Behind Old Mandir, Ananthapur District, A.P.-515134.
**...PLAINTIFF**
**AND**
**1) The Tahsildhar Officer,** THIRUMALGIRI.
**2) All CONCERNED.**
**...DEFENDANTS No 1 & 2**
Whereas the Plaintiff above named field the case against the Defendants herein to declare the Plaintiff as the Legal Heir of the Deceased Sri Late D S Mowliah, and the same was posted to **09/07/2024.** The **"ALL CONCERN"** are therefore directed to appear before the above court either in person or through your pleader with your defense if any at 10.30 AM on the above said date, failing which the above suit will be heard and determined ex-parte.
**// BY ORDER OF THE HON'BLE COURT//**
**M/S. N. PRABHAT,**
**K. RAVIKANTH, N.S. CHAITANYA,**
**R. VENKAT DAS,** ADVOCATES,
O/o Flat No. 203, 2nd Floor, Sai Plaza, D. No. 1-424 to 426, Above Union Bank of India, Mettuguda, Secunderabad – 500017.
**COUNSEL FOR PLAINTIFF**

